
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





# మ(మా)యాస్మృతులు

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

" ***బాబులూ..*** నాయనకేమీ బాగోలేదురా, మళ్ళీ. ఏమోగా చేస్తున్నారు. నాకు చాలా భయంవేస్తోంది. ఒకసారి చూద్దువు రామీ, అభీ ఆకే దేఖ్ లేనా ఏక్ బార్ " అన్న తల్లి ప్రమీలమ్మ మాటలకి, అప్పుడే మూతలు పడుతున్న కళ్ళని బలవంతంగా తెరిచి చూస్తూ.

"క్యా హువా మా? అభీతో దేఖా హై హంనే "అన్నాడు బాబులు అనే పార్థసారథి.

వాళ్ళు అవడానికి తెలుగువాళ్ళే అయినా ఎన్నో ఏళ్ళు బీహార్ రాజధాని పాట్నాలో ఉండి, పదిహేనేళ్ళక్రితం అతని ఉద్యోగరీత్యా బెంగుళూరుకి మారారు. వాళ్ళిల్లే ఒక మిని ఇండియా అని చెప్పవచ్చు, అవడానికి అందరూ తెలుగువారే కానీ, దేశంలో తలోమూలా స్థిరపడడం వల్ల వారి, వారి తెలుగులో ఆ స్థానిక భాష తాలూకు యాస చాలా ప్రస్ఫుటంగా ఉంటుంది.

అతని అమ్మగారైన ప్రమీలమ్మ గారు కూడా చిన్నతనాన మెడ్రాస్‌లోనూ, నాగపూర్ లోనూ పెరిగారు. పెళ్ళి అయ్యాకా, భర్తతోకలిసి పాట్నాలో ఉండడం వల్ల ఆ యాస కూడా తోడై , ఆవిడ బాష కూడా ఒక మణిప్రవాళ భాషగా తయారయింది. అయినా వీలున్నంతవరకూ మాతృభాషని మరిచిపోకుండా ఉండడానికి వారు చేసే ప్రయత్నం మాత్రం గొప్పది.

మంచమ్మీదనించి ఒక్క ఉదుటున లేచి తండ్రి పడుకునే గదికి పరిగెత్తాడు. అతని వెనకే ప్రమీలమ్మ. మంచానికి బల్లిలా అతుక్కుపోయినట్టున్న తండ్రిని చూస్తే ఒక్కక్షణం అతని మనసు బాధతో మూలిగింది. దాదాపు తొంభై ఉండవచ్చు అతని తండ్రి గోపాలకృష్ణ గారికి. ఉబ్బసం తప్ప మరేమీ సమస్య లేదు అతనికి.

కానైతే ఈ మధ్యన పెరుగుతున్న వయసు కారణంగా తరచుగా ఏదో ఒక చిన్న అనారోగ్యం కలగడమో, లేక అధాట్టున పడిపోవడమో, ఏదో ఒకటి జరుగుతూ ఉంది. వర్షాకాలం ముగుస్తూ, శీతాకాలానికి దారి తియ్యడంతో చలికీ, గాలికీ తరచూ ఆయసం రావడం ఒకటి. దానికి తోడు బెంగుళూరు వాతావరణం. పెద్ద ఇబ్బందా? అంటే ఉందని కానీ, లేదా? అంటే లేదని కానీ చెప్పలేము.

గత రాత్రినించీ ఆయన పరిస్థితి బాగులేదు, బొత్తిగా ఏమీ తినలేదు, తాగలేదు. ఆయన తినే అర ఇడ్లీయో, ఒక బిస్కటో కూడా తినకపోవడంతోనూ, ఆగకుండా వస్తున్న దగ్గుతోనూ చాలా నీరసించిపోయి మాట రావడంలేదు. శ్వాస పరమైన ఇబ్బందులు మొదటినించీ ఉండనే ఉన్నాయి. రాత్రంతా నిద్రలేదు ముగ్గురికీ, దానివల్ల ఆయనకి మరింత నీరసం ఆవహించింది. ఒంట్లో ఓపిక లేకపోవడంతో పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. పెద్దగా ములుగుతూ, ఏవో మాటలాడుతున్నారు, తన చిన్నప్పటివీ, అవీ. దాంతో ప్రమీలమ్మకి మరింత కంగారుగా ఉంది. ముందు అప్పుడప్పుడూ

అవసరం పడినా, ఈ మధ్యన తరచూ కావలసి రావడంతో గత రెండుసంవత్సరాలుగా ఇంట్లోనే ఆక్సిజన్ యూనిట్ కూడా కొని పెట్టుకున్నారు.

"ఏం చెయ్యాలో తోచడం లేదు?" ప్రమీలమ్మ గొంతులో ఆందోళన. అతనికీ కాళ్ళూ చేతులు ఆడలేదు.

"పోయి ఎదురింటి వారిని పిలుచుకునొస్తునా? "అంటూనే ఆవిడ ఎదురు ఫ్లాట్‌కి దారితీసింది. అతను కూడా పక్కన బ్లాక్ లో ఉండే తన స్నేహితుడు వాసు, అతని భార్యలకి వెంటనే రమ్మని ఫోన్ చేశాడు.

మరో పదిహేను నిమిషాల్లో అందరూ వచ్చేశారు. చెన్నైలో ఉంటున్న తమ్ముడికీ, ఊరిలోనే ఉంటున్న అక్కా, బావలకి కబురు వెళ్ళింది. పదిహేను నిమిషాల్లో వాళ్ళూ వచ్చారు. అతని తమ్ముడు కూడా వెంటనే బయలుదేరాడు.

గత పదిహేనేళ్ళుగా తండ్రిని రెగ్యులర్ గా చూస్తున్న డాక్టర్‌తో మాట్లాడాడు. ' నాకతని కేసు ఎంత బాగా తెలిసినా సరే, దూరాన్నించి చెప్పడం కష్టం, ముందు మీరు హాస్పటల్‌కి తీసుకుని వెళ్ళండి ' అన్నాడు అతను.

అమ్మా కొడుకులిద్దరూ ఆలోచనలో పడ్డారు. 'పెద్దవయసు, ఇంట్లోనే ఉంచితే మంచిదా? లేక హాస్పటల్‌కి తీసుకుని వెళ్తే మంచిదా?' అని వారి ఆలోచన.

ఈలోపున రెండో అంతస్థులో ఉన్న డాక్టరు, శాంతా మామీ వచ్చి, పరీక్షించి, నాడి బాగా ఉందనీ, బీ.పి కూడా బాగానే ఉండవచ్చు కానీ శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంది కనక వెంటనే పెద్ద ఆసుపత్రికి తీసుకుని వెళ్తే వెంటనే వారు ఎమర్జన్సీ ట్రీట్‌మెంట్ ఇస్తారు కనక తొందరగా కోలుకుంటారని చెప్పింది.

వాళ్ళు ఉండే ప్రాంతానికి దగ్గరలో రెండు మూడు పెద్ద, పెద్ద కార్పోరేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ఆయనకి అంతకుముందు రెండు మూడు సార్లు అవసరమైనప్పుడు వాటిల్లో ప్రముఖమైనది, చాలా పేరున్నదీ అయిన స్ఫుత్నిక్ హాస్పటల్‌కే తీసుకెళ్ళారు. కృత్రిమ ఉపగ్రహాల్లో మొదటిది అయిన స్ఫుత్నిక్ లాగే తమదీ కార్పోరేట్ ఆసుపత్రుల రంగంలోనే మొదటిది అని అదే పేరు పెట్టుకున్న ఆ హాస్పటల్ కేవలం ఆ ఊరిలోనే కాక, దేశంలోని పలునగరాలలో కూడా చాలా ప్రముఖమైనది.

పెద్ద ఆసుపత్రులన్నింటిలోనూ, పేషెంట్ల పాత వివరాలన్నీ ఉంచుతారు, ఆయన పేరు, క్రమసంఖ్య చూసిన వెంటనే వాళ్ళు మనమేవీ చెప్పక్కరలేకుండానే అన్ని వివరాలు తెలుసుకుంటారు కనక అక్కడికే తీసుకెళ్తే మంచిదని అంతా అనుకున్నారు. వెంటనే ఆంబులెన్స్‌కి కబురు పెట్టారు. చిన్నది, ఆక్సిజన్ సిలిండర్ ఉన్నది కావాలని చెప్పారు.

ఫోన్ చేసి వాళ్ళు వస్తామని చెప్పగానే, దాని గురించి వేచి ఉండడం తప్ప మరేమీ చెయ్యలేరు కనక అందరూ ఎక్కడివారక్కడ కూర్చుని ఎదురు చూడసాగారు. మధ్య లో విషయం తెలిసిన వారి దగ్గరనించి ఫోన్లూ, పలకరింపులూ. - ఆయనకి కొద్దిగా గ్లూకోజ్ నీళ్ళు తాగించే ప్రయత్నం చేసారు. ఆయన ఒకటి రెండు చెంచాల నీళ్ళు తాగారు కూడా.

ఇంతలో హాస్పటల్‌కి తీసుకుని వెళ్ళాలా వద్దా? అనే చర్చ మళ్ళీ మొదలయింది. మనసంతా దిగులుతో తండ్రి పక్కనే కూర్చున్న పార్థసారధికి మాత్రం రకరకాల ఆలోచనలు కందిరీగల్లా ముసురుతున్నాయి.

"ఎక్కడి నాన్న? ఎక్కడ పుట్టి, ఎక్కడికొచ్చారు? తమకి గుర్తున్నంతవరకూ పాట్నాయే తమ సొంత ఊరు. నాన్న ఎక్కడ అక్కడే పుట్టారేమో మరి? తాతగారు కూడా బీహార్ గవర్నమెంటులో పనిచేసేవారుట, ఆయన ఆరుగురు పిల్లలని పెంచడం, చదివించడం లో ఎలాంటి  లోటూ చెయ్యలేదు. తమ చిన్నతనాన కూడా ఇద్దరు అత్తలూ దగ్గరలోనే ఉండేవారు. నాన్న నలుగురన్నదమ్ములూ తాతగారింట్లోనే కలిసి ఉండేవారు. శేఖర్ భయ్యా, పిప్పీ దీదీ, విజయా దీదీ ఇలాగే పిలుచుకుంటూ అందరూ ఒకే తల్లితండ్రుల పిల్లల్లా ఉండేవారు. నాయన ఎల్.ఐ.సీలో పనిచేసి రిటైర్ అయ్యారు. తనకి తెలిసి జీవితాన్ని నాన్న ప్రేమించినంతగా మరెవరూ ప్రేమించరేమో. ఆయన ఎప్పుడూ తను అనుకున్నది చేసేవారు, తనని ప్రేమించుకోలేనివాడు మరెవరినీ ప్రేమించలేడు అనేవారు. చిన్నప్పుడు సైకిల్ మీద కూర్చోబెట్టుకుని పాట్నా లో జరిగే చిన్న చిన్న ఫుట్‌బాల్ మేచ్ లు చూపించేవారు. పైకి పెద్దగా ప్రేమ ప్రదర్శించకపోయినా తాము నలుగురూ అంటే నాన్నకెంత ప్రేమో తనకి తెలుసు. ఆడపిల్లలంటే మరీనూ."

ఇలా నాన్న తాలుకు ఆలోచనల్లో రెండు నిమిషాలుండిపోయాడు.

చేతిలో ఉన్న ఫోన్ పక్కన పడేసి సోఫాలో కూర్చున్నాడు. చుట్టూ కూర్చున్నవారందరూ ఆసుపత్రికి తీసుకెళ్ళాలా వద్దా అన్న విషయం మీదే చర్చ చేస్తున్నారు. అతని తల్లి ప్రమీలమ్మ వద్దని అంటారు, ఇవి భర్తకి నిజంగానే చివరి ఘడియలైతే అతను ప్రశాంతం గా, కొడుకు ఇంట్లో వెళ్ళిపోవడమే మంచిది అని ఆవిడ అభిప్రాయం.

"వద్దురా బేటా" అందావిడ మెల్లగా. అతను ఏమీ వినడంలేదు. ఆక్సిజన్ సహాయంతో పైకీ కిందకీ కదులుతున్న నాన్న శ్వాసనే చూస్తున్నాడు. అతని మనసు మాత్రం గతంలోని హాస్పటల్ అనుభవాలనే చూస్తోంది.

దాదాపు నాలుగు నెలల క్రితం..

కాలం కాని కాలంలో వచ్చిన తుఫాన్ ప్రభావం వల్ల ముసురేసి ఆకాశం మబ్బుల దుప్పటి కప్పుకుని మూడంకె వేసుకుని పడుకుంది. రోజూ వచ్చే సూరీడే కాదు, కసిదీరా కూసేసి జనాలని నిద్రలేపే కోడిపుంజు కానీ, రోజూ వచ్చి తమ కూతలతో విసిగించే పావురాలుకానీ కంటికి కనబడటంలేదు. స్కూళ్ళకీ, ఆఫీసులకీ వెళ్ళడం తప్పదు కనక ఎలాగో మెల్లిగా తయారయ్యి వెళ్తున్నారు జనం.

నీళ్ళల్లో చెయ్యి పెట్టాలన్నా చలికి జివ్వు మంటున్నాయి వేళ్ళు. మఫ్లర్, స్వెటర్ వేసుకుని మంకీ కాప్ పెట్టుకుని రగ్గు కప్పుకుని పడుకుని ఉన్న గోపాలకృష్ణ గారికి ఉన్నట్టుండి ఆయాసం ఎక్కువయింది. 'డ్యూయోలిన్ ఇన్‌హేలర్ ' పక్కనే ఉండడంతో అది నోట్లోస్ప్రే చేసుకున్నారు అలవాటుగా. ఇంకా శ్వాస అందినట్టు అనిపించక పోవటంతో భార్యని

పిలవబోయారు. ఆయన పడుకున్నారు కదా ! అని ఆవిడ అప్పుడే స్నానానికి వెళ్ళారు, పక్క గదిలో కొడుకు ఆఫీస్‌కి వెళ్ళడానికి తయారవుతున్నాడు. వంట అమ్మాయి వంటగదిలో పొద్దున్న టిఫిన్ తయారు చేస్తోంది.

పిలిచాననుకున్నారు కానీ మాట బయటకి రాలేదు, 'నెబ్యులైజేషన్' చేస్తే కొంత ఉపశమనం ఉండవచ్చు అని ఆయనకి అనిపించింది. 'సాలిసిలిక్ ఆసిడ్ 'అనే ద్రవాన్ని ఆవిరిగా మార్చి ముఖానికి ఆక్సిజన్ మాస్క్ లాంటి దాని ద్వారా ముక్కులోకి పంపడం వల్ల గొంతులోనూ, ఛాతీలోనూ కఫాన్ని తగ్గించి శ్వాస ప్రక్రియ మాములుగా జరగడానికి ఉపయోగపడే సాధనమే 'నెబ్యులైజర్'. ఈ మధ్య నగరాల్లో చాలా మంది ఇళ్ళల్లో థర్మామీటర్ ఉన్నంత సాధారణంగానే ఇదీ ఉంటోంది. ముఖ్యంగా చిన్నపిల్లలూ, పెద్దవాళ్ళూ ఉన్న ఇళ్ళల్లో.

'నెబ్యులైజర్' కోసం చుట్టూ చూశారు ఆయన. రాత్రి ఒకసారి చేసుకున్నాకా, దాన్ని తన కాళ్ళదగ్గరున్న పెద్ద టేబిల్ మీద పెట్టాడు కొడుకు. అది కనిపిస్తూనే ఉంది కదా, మళ్ళీ వాళ్ళని పిలిచి ఇబ్బంది పెట్టడమెందుకనుకుని ఆయనే లేచి దాన్ని తీయబోయి, మంచం కొట్టుకుని గభాల్న కింద పడిపోయారు. మంచం గట్టిగా తగిలింది మోకాలికి "అమ్మా"అంటూ కింద కూలబడిపోయారు. ఎంత వారికైనా నొప్పిలోనూ, బాధలోనూ "అమ్మ"తప్ప మరేమీ గుర్తుకు రాదు.

ఈ సందడికి స్నానం చేసి చీర కట్టుకుంటున్న ప్రమీలమ్మ గబ గబ చుట్టబెట్టేసుకుని వచ్చారు. ఏం గుచ్చుకుందో తెలియదు కానీ, మోకాలి దగ్గర దెబ్బ గట్టిగానే తగిలింది. వెంటనే ఒక పక్క వాచిపోయింది, మరొక పక్క చర్మం చిట్లి రక్తం వస్తోంది. కింద కూల బడిపోయిన ఆయన ఏమీ మాట్లాడటం లేదు. గబ గబా ఇద్దరూ కలిసి సాయం పట్టి ఆ-యనను మంచమ్మీద పడుకోబెట్టారు.

"మమ్మల్ని పిలవవచ్చు కదా, మీరెందుకు లేచేది? "అని ఆవిడ విసుగ్గా అనబోతూ ఆయన ముఖకవళికలు చూసి - ఆగిపోయింది.

మాట రావడం లేదు ఆయనకి, కళ్ళు పైకి తేలవేసినట్టుగా కనిపిస్తున్నారు. శ్వాస దొరకక చాలా కష్టపడుతున్నారు. వెంటనే స్పుత్నిక్ హాస్పటల్ కి తీసుకెళ్ళారు. అది రెండోసారి అక్కడకి రావడం. మొదటిసారి ఆయనకి ఎప్పుడో చిన్నప్పటి అల్సర్ మళ్ళీ తిరగబెట్టడంతో ఆపరేషన్ కి వచ్చారు.

నగరానికి ఇంచుమించు నడిబొడ్డున, దాదాపు 3-4 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది ఆ పెద్ద హాస్పటల్. మెయిన్ గేట్ దగ్గరనించీ, అడుగడుగునా దర్శనమిచ్చే సెక్యూరిటీ వాళ్ళూ, ప్రతీ నిమిషానికి ఒకటో, రెండో చొప్పున వస్తూ, వెళ్తూ ఉండే కార్లు, ఆటోలూ, టాక్సీలూ, విపరీతమైన రద్దీ. పెద్ద అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపిస్తూ ఉంటుంది.

ఒక అరకిలోమీటర్ మేరా ఆసుపత్రి ముందర పార్కింగ్, అది దాటి వస్తే రిసెప్షన్ ఏరియా. అక్కడకి వస్తే అది ‘ షాపింగ్ మాలా? హాస్పటలా ?‘ అన్న అనుమానం రాక తప్పదు. పెద్ద చెక్క కౌంటర్ వెనక నిర్విరామంగా పనిచేసున్న నలుగురు యువతులూ, నాలుగైదు కంప్యూటర్‌లూ, దానికి కాస్త ఎడంగా మరొక టేబిల్ వేసుకుని కూర్చుని, ఎవరికేం కావాలో తెలుసుకునే మరో ఇద్దరూ. ఆడవారందరూ ఒకేరకమైన సిల్క్ చీరలూ, మగవారందరూ పాంటూ, షర్టూ, టైలూ ధరించి పెద్ద స్టార్ హోటల్ రిసెప్షన్‌ని గుర్తుకుతెస్తున్నారు. నేలంతా నున్నగా, పాలిష్ చేసిన గ్రానైటుతో ధగధగ లాడుతోంది. గోడలకి వేసిన లేతరంగులు చిన్నపిల్లల బుగ్గల్లా నున్నగా, అందంగా ఉన్నాయి. పైనుంచి వేలాడుతున్న దీపాలు, ఎదురుగా దాని అధినేతది పెద్ద ఫోటో, దానిపైన "యూ ర్ ఇన్ సేఫ్ హాండ్స్, వీ విష్ యూ ఏ స్పీడీ రికవరీ" అని రాసి ఉన్న పెద్ద బోర్డ్.

మధ్యలో ఉన్న లిఫ్ట్ లాబీకి కుడి పక్కన వినాయకుడిది పెద్ద చందనపు బొమ్మా, దాని ముందు ఎప్పుడూ వెలిగే నూనె దీపం, ఎలక్ట్రిక్ దీపాలు, ఎడం పక్కన వాళ్ళదే మందుల షాపు ( ఫార్మసీ), దాని ముందు దాదాపు ఆరు వరసల్లో వేసి ఉన్న కుర్చీలు, తమ వారి మందులకోసం అక్కడ కూర్చుని వేచి చూస్తున్న బంధువులూ.

దానికి ఎదురుగా చిన్న బేకరీ, గ్రీటింగ్ కార్డ్‌లూ, పూల బొకేలూ అమ్మే మరొక దుకాణం, పక్కన రకరకాల బీమా పథకాలు మనకి ఎలా ఉపయోగ పడతాయో? చెప్పడానికి తెరిచిన ప్రముఖ ప్రైవేటు బీమా కంపెనీ వారి చిన్న ఆఫీసూ, ఇలా ఎంత బిజీ గా ఉండాలో, అంతలా ఉంటుంది.

వినాయకుడి బొమ్మ వెనక వైపు నించి ఎమర్జెన్సీ వార్డ్‌కి దారి ఉంది. అక్కడ పిల్లలకీ, పెద్దలకీ వేరుగా ఉంటాయి సదుపాయాలు. తండ్రిని ఆంబులెన్స్ లో తీసుకుని వచ్చిన పార్థసారథి, వాళ్ళ అమ్మా ఆయన్ని ఎమర్జెన్సీ లో చేర్చగానే హంగామా మొదలు.

"ఇక్కడికి తెచ్చారుగా, మేం చూస్తాం, మీరు ముందు ఫార్మాలిటీస్ పూర్తి చెయ్యండి "అని ఒకటే ఊదరగొట్టడం మొదలు పెట్టింది సిస్టర్.

" మేము ఇంతకుముందు కూడా వచ్చాము ఇక్కడకి, నాకు తెలుసు, మీరు ట్రీట్ మెంటు మొదలు పెట్టండి, నేను వెళతాను "అన్నాడతను. వదిలేసి వెళితే వాళ్ళు అశ్రద్ధ చేస్తారని అతనికి తెలుసు.

"అది మాకు తెలుసు కదా, మీరు ముందు వెళ్ళండి" అందావిడ దాదాపు అతన్ని తరుముతున్నట్టు.

ఆంటీ బయాటిక్ ఇంజెక్షన్ ఇచ్చి, నెబ్యులైజర్ పెట్టడానికి రెడీ అవుతోంది. ఇంతలో చిన్న డాక్టర్ వచ్చి చూశాడు, "స్పెషలిస్ట్ వస్తారు" అని చెప్పి రెండు నిమిషాలలో వెళ్ళిపోయాడు. ఎమర్జన్సీ వార్డంతా ఒకటే గోలగా, వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళతో గడబిడగా ఉంది.

"ఇక్కడ పేషెంట్లకి ఏం ప్రశాంతత ఉంటుందో?" అని అనుకోకుండా ఉండలేకపోయాడు.

"చూశారుగా, ట్రీట్‌మెంట్ మొదలయింది, ఇంక వెళ్ళండి" అంది నర్స్ విసుగ్గా.

రెసెప్షన్ దగ్గర పెద్ద క్యూలు కదులుతున్నాయి నెమ్మదిగా. " సినిమా టికెట్లకే కాదు ఇక్కడా ఇంత క్యూవా? ఎంతమంది రోజూ సిక్ అవుతున్నారో?" అనుకున్నాడు.

దాదాపు పది నిమిషాల తర్వాత అతని వంతు వచ్చింది. అద్దం వెనకాల అమ్మాయి అందంగా నవ్వుతూ "గుడ్ మార్నింగ్ యువర్ పేషెంట్ ఇన్ అవర్ సేఫ్ హేండ్స్" అని చిలకపలుకులు వల్లిస్తూ, అతనిచ్చిన రిజిస్ట్రేషన్ కార్డ్ తీసుకుని కంప్యూటర్‌లో వివరాలు చూసింది, వెంటనే ఎమర్జెన్సీ వార్డ్‌కి ఫోన్ చేసి వివరాలు కనుక్కుని.

"సార్ ! ఇట్ ఈజ్ లైక్ దిస్.. మీ నాన్నగారు కనీసం రెండు మూడు రోజులుండాల్సి రావచ్చు, ఎక్స్‌రే, ఈ సీజీ, టూ డీ ఎకో లాంటి మామూలు పరీక్షలేకాక, పడిపోయారు కనక సీటీ లాంటివి కూడా చెయ్యాల్సి రావచ్చు కనక మీరు ముందు జస్ట్ ఒక యాభైవేలు డిపాజిట్ చెయ్యండి. అలాగే మీకున్న రూము ఆప్షన్స్ ఇవి, అని సెమీ డీలక్స్, సూపర్ డీలక్స్, స్పెషల్ వార్డ్, అటెండెంట్‌కి చిన్న దీవానూ, పెద్ద మంచం, పేషెంట్‌కీ అటెండెంట్‌కీ భోజనాలూ " అంటూ రకరకాల కాంబినేషన్ల లిస్ట్ చదివింది. "ఇడ్లీ, దోశా, పూరీ, ఊతప్పం, పెసర, మినప" అంటూ చదివే హోటల్ వెయిటర్ గుర్తొచ్చాడు అతనికి.

"యాభైవేలా? " అన్నాడు. ఇవ్వలేక కాదు. అంత పెద్ద మొత్తాన్ని ఆ అమ్మాయి జస్ట్ అనడం వల్ల వచ్చిన ఆశ్చర్యంతో.

"ఇది ఊరికే డిపాజిట్. మిగిలితే మేమే మీకు వెనక్కి ఇచ్చేస్తాం "అంది నవ్వుతూ.

"ఓహో, అలా కూడా ఉంటుందా?" అనుకుని చెక్ రాసి ఇచ్చాడు, సెమీ స్పెషల్ రూం తీసుకున్నాడు. ఆ అమ్మాయి ఇచ్చిన రసీదు తీసుకుని మళ్ళీ ఎమర్జన్సీ వార్డ్ కి పరిగెత్తాడు.

"రూము తీసుకున్నారా? పెద్ద డాక్టర్ గారు రెండు మూడు రోజులుండాలని ఇప్పుడే అన్నారు అంది సిస్టర్.

" పెద్ద డాక్టర్ ఇప్పుడే అంటే, అక్కడ అప్పుడే ఎలా తెలిసింది? " అని మాత్రం అనుకున్నాడు.

గ్రానైటు పలకలూ, డిజైనర్ సోఫాలూ, స్థంభాలమీదా, గోడల మీదా పెయింటింగులూ, ధగధగా మెరిసే దీపాలతో మెరిసిపోతూ ఉండే రెసెప్షన్ ఏరియాకీ వెనక ఉండే వాటి కీ పొంతన లేదు. అది ఐ.సీ యూ అయినా సరే, ఆర్డినరీ రూమైనా సరే.

పేషెంట్‌ని స్ట్రెచర్ మీద పడుకోబెట్టి రాంప్ మీదుగా తీసుకెళ్ళడం మొదలు పెట్టారు ఇద్దరు మగవాళ్ళు. వెనకే వస్తామంటే,

" మాకు తెలుసు కదా, మీరు లిఫ్ట్ లో రండి, రాంప్ ఇరుకుగా ఉంటుంది అందరం నడవలంటే" అంటూ దాదాపు సారధిని తోసుకుంటూ వెళ్ళాడు అతను.

ఈ అదురుకి పేషెంట్ చేతి నించి ఐ.వీ ట్యూబు ఊడిపోయింది. "అయ్యో" అని ప్రమీలమ్మ ఏదో చెప్పబోయేంతలో, ఫోన్ చార్జర్ వైర్ పెట్టినంత మామూలుగా దాన్ని మళ్ళీ పెట్టేసి కింద పడిన చుక్కల మీద తన హవాయి చెప్పుతో రాశాడు. మరొక నిమిషానికి అది ఆవిరయింది.

అప్పుడు చూశాడు సారధి, తండ్రి కాలికి తగిలిన దెబ్బకి కట్టుకట్టలేదని. అడిగితే సిస్టర్

"అదేమీ ఎమర్జన్సీ కాదు, రూముకి తీసుకెళ్ళాక, అక్క డ వాళ్ళు కడతారు "అంది.

అలా మొత్తానికి రూముకు వచ్చారు, అక్కడా పరిస్థితేమీ భిన్నంగా లేదు. రూము రెడీ చెయ్యనే లేదు. పేషెంట్ పడుకోవాల్సిన మంచమ్మీద కొత్త దుప్పట్లు కానీ, రగ్గు కానీ లేదు. ఊరికే రబ్బర్ షీట్ మాత్రం వేసి ఉంది. ఇంటి నించి ఎలా తెచ్చారో, అలాగే ఆయన్ని పడుకోబెట్టారు దాని మీద. క్రితంసారి వచ్చినప్పుడు బాగానే ఉండాలి, ఈ సారి సర్వీస్ అసలు బావులేదు అనుకున్నారు ఇద్దరూ.

'ఐవీ స్టాండు' అని సారధి అనబోయేంతలో కర్టెన్ కి అవతల వైపున్న స్టాండ్ గబుక్కున లాగి, సీసాని దానికి తగిలించాడు. అవతల పేషెంటు ఎవరూ లేరు కనక సరిపోయింది.

"అదేమిటి? కనీసం బెడ్‌కి ఒకటి ఉండాలి కదా "అన్నాడు సారధి కొం చెం చిరాగ్గా.

" పక్కనెక్కడో అవసరం అయితే తీసుకెళ్ళుంటారు "అన్నాడతను. దీనికింత గొడవేమిటన్నట్టుగా.

"డ్రెస్సింగ్? "ప్రమీలమ్మ గుర్తు చేస్తుంటే

"అది మా పని కాదమ్మా, వార్డ్ నర్స్ లు చెయ్యాలి, మేము కాంపౌండర్లం కాదు "అన్నాడు నిర్లక్ష్యంగా. "మాకిచ్చేది మాకిస్తే, మేము పోతాం "అన్నట్టుగా ఉంది అతని వైఖరి. ఇద్దరికీ చెరో యాభై ఇచ్చాడు. తర్వాత అరగంట కూర్చున్నా ఎవరూ రాలేదు.

"ఊరికే ప్రతీ బెడ్ పక్కనా బెల్లూ, రెండు పూలూ పెడితే చాలా? " అనుకున్నాడు. బెల్ కొట్టీ, కొట్టీ విసుగేసింది.

"డాక్టర్ ని చూసి వస్తానమ్మా "అని అమ్మకి చెప్పి, బయటకి వచ్చాడు.

వార్డ్ లో పధ్నాలుగు గదులున్నాయి. సెమీ స్పెషల్ కనక ప్రతీ గది మధ్యలోనూ కర్టెన్ వేసి, గదికిద్దరు చొప్పున ఉంచుతారు. ప్రతీ గది తలుపు మీదా వారు ఏ డాక్టర్ పేషెంట్లో, అన్న విషయం రాసి ఉంచుతారు.

వార్డ్ చివరగా ఉన్న గదిలో ఆ వార్డ్‌కి సంబంధించిన నర్స్‌లూ, ఆయాలూ ఉంటారు. అక్కడకి వెళ్ళి చూస్తే కునికిపాట్లు పడుతున్న ఒక్క ఆయా తప్ప మరెవరూ లేరు.

నిద్రాభంగం అయినందుకు విసుక్కుంటూనే " వస్తారయ్యా, నాది నైట్ డ్యూటీ, ఈ పాటికింటికెళ్ళాల్సిందే, మేరీ రాలేదు ఇంకా, అందుకే ఉండిపోయాను, ఆవిడ రాగానే చేస్తుంది, ఎవరూ లేకపోతే బాగోదని ఉన్నాను " అంది.

"తర్వాత వారు వచ్చేవరకూ డ్యూటీలో ఉండాలన్న నియమం బావుంది కానీ, ఆమె ఉన్నందువల్ల ప్రయోజనం ఏమిటీ ? "అని అడగలేకపోయాడు.

అప్పటికీ ఆపుకోలేక "నెబ్యులైజేషన్ ఇచ్చి నాలుగైదు గంటలు దాటింది కదా? పోనీ అది ఎప్పుడిస్తారు మళ్ళీ? "అని అడిగాడు.

దానికావిడ మరింత విసుగ్గా, "అవన్నీ నాకు తెలీదు, సిస్టర్‌ని అడుగు.. ఈ నెల్లో ఇది నాలుగో సారి ఇలా డ్యూటీ వేళ పెరగడం. మేరీ కొడుకు జ్వరం నా ప్రాణానికొచ్చింది. వెధవుద్యోగం "అనుకుంటూ మళ్ళీ కునుకుపట్టింది ఆవిడ. మేరీకి చిన్న కొడుకున్నాడు, వాడికి బాగోలేకపోతే మేరీ రావడం ఆలస్యం అవుతుంది.. అప్పుడీవిడకి ఈ చికాకులు తప్పవు.

ఆవిడింకేమీ వినే పరిస్థితిలో లేదని అర్థం చేసుకున్నాడు. రాత్రంతా పనిచేసి అలసిపోయిందేమో అనుకున్నాడు.

పక్కన ఫ్లోర్ సూపర్ వైజర్ రూం ఉంది. అతనితో చెప్తే ఏమైనా ఉపయోగం ఉంటుందేమో? అని వెళ్ళబోతూ అతని గదిలోంచి మాటలు గట్టిగా వినిపించడంతో ఆగిపోయాడు. సూపర్ వైజర్ గొంతు కఠినంగా వినిపిస్తోంది.

" మేడం, ఇది మొదటిసారి కాదు, మీరు కిందటి సారి కూడా మన స్టోర్ లోంచి మందులూ, సిరింజ్‌లూ అవి పేషెంట్స్‌కి ఇవ్వడం, దాన్ని నోట్ చేసుకోవడం మర్చిపోవడం. డిస్‌చార్జ్ సమ్మరీ అప్పుడు వాళ్ళు ఎంత గొడవ చేశారో మీకు తెలుసు.. మళ్ళీ ఎందుకు చేస్తారు అదే తప్పు? అర్జంట్‌గా కావలసి వస్తే ఇచ్చాను, వాళ్ళ హడావిడిలో మర్చిపోయాను, అన్నారు, మళ్ళీ అదే తప్పు ఇప్పుడూనూ, ఇలా అయితే చాలా కష్టం. మళ్ళీ చెప్తున్నాను మీకు" అన్నాడు గట్టిగా.

"పేషెంట్ కి చాలా ప్రమాదంగా ఉంటే అలా చేశాను, తర్వాత వాళ్ళ ఖాతాలో రాయడం మర్చిపోయాను. కానీ డబ్బు నా జీతంలోంచి ఇచ్చానుగా "నెమ్మదిగా అంటోంది ఒక ఆడగొంతు.

" అదే నేను చెప్పేది, మీరు మందులు, అవీ వాళ్ళు తెచ్చుకునేవరకైనా ఆగాలి, లేదా మనమిస్తే వాటిని జాగ్రత్తగా గుర్తు పెట్టుకుని వెనక్కి రాబట్టుకోవాలి. అంతే కానీ ఇలా చేస్తే కుదరదు, ప్రతీ సారి ఇలా గుర్తు పెట్టుకుని జీతాల్లోంచి కట్ చెయ్యాలంటే కష్టం అని ఫైనాన్స్ వారు నాతో అన్నారు. ఈ సారి మీతో ఉన్న సిస్టర్ సీనియర్ సిస్టర్ కనక, గుర్తు పెట్టుకుని రాసుకుంది మీరిచ్చిన మందులూ, అవీ లేదంటే ఇన్‌వెంటరీ టాలీ అవకపోతే ఎంత ఇబ్బంది? మీకేం తెలుస్తాయి మా పాట్లు? మనదేమీ ధర్మాసుపత్రి కాదు మేడం, మరొకసారి ఇలాంటివి జరగకూడదు. మీలాంటి కొత్త డాక్టర్లకి స్పుత్నిక్ ఇచ్చే బ్రాండ్ వాల్యూ సంగతి మర్చిపోకండి" అన్నాడు హెచ్చరిస్తున్నట్టుగా.

కళ్ళల్లో సన్నటి నీటిపొరతో బయటకి వచ్చింది ఆ అమ్మాయి.

పట్టా పొందుతూ చేసిన ప్రమాణానికి విలువిస్తూ వైద్యం చేసిన ఆ చిన్నపిల్లకి హెచ్చరికలిచ్చిన అతనితో మరేమీ మాట్లాడటం ఇష్టంలేక వెను తిరిగాడు. అప్పటికి పక్క రూములో సిస్టర్ కనిపించడంతో అడిగాడు.

"మందులేమైనా ఇస్తారా? నెబ్యులైజేషన్ ఎప్పుడు "అని.

ఆవిడ "డాక్టర్ చెప్తేనే కానీ ఇవ్వము" అని వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. చాలా కోపం వచ్చింది అతనికి. "వార్డ్ లో సిస్టర్స్ కి అన్నీ తెలుసు, ఇస్తారు అని డాక్టర్లు చెప్పారు, వీళ్ళేమో డాక్టర్ చెపితేనే కానీ ఇవ్వమంటారు? ఇదెలా?" అని విసుక్కున్నాడు.

డాక్టర్ దగ్గరకి వెళ్ళాడు వడివడిగా. ఆవిడ ఓ.పీ లో చాలా బిజీగా ఉంది. పది నిమిషాల తర్వాత దొరికింది - ఆవిడతో మాట్లాడే అవకాశం.

అప్పుడు వచ్చింది ఆవిడ, అతనితో పాటుగా రూంకి.

వస్తూనే.. " కాలెందుకు ఇంత వాచింది? ఫ్రాక్చర్ అయిందేమో? ఎక్స్ రే తీశారా?" అంటూ అడగసాగింది. తనస్పెషలైజేషన్‌నీ, పేషెంటుకున్న ముఖ్యమైన సమస్యనీ మర్చిపోయి ఎక్స్ రే గురించి మాట్లాడుతున్న ఆవిడని అర్థం కానట్టు చూశాడు. అంతే కాదు, ఆవిడ కూడా డ్రెస్సింగ్ గురించి మాట్లాడలేదు. దెబ్బ తగిలిన భాగాన్ని అలా వదిలేస్తే ఎంత ప్రమాదమో అతనికి తెలుసు, కానీ తెలియనిదల్లా హాస్పటల్ వాళ్ళు ఎందుకు పట్టించుకోవడం లేదు ? అనేదే ఎక్స్ రే రాయబడింది. ఆవిడ పేషెంట్‌ని చూసి, " చూశారా? ఇందాకటి కంటే ఎంత మెరుగయ్యారో? స్పుత్నిక్ మహిమ" అంటూ నవ్వింది. కఫాన్ని కరిగించే బ్రోంఖో డయలేటర్, ఇన్‌ఫెక్షన్ తగ్గడానికి యాంటీ బయాటిక్స్ రాసి ఇచ్చింది, వెంటనే మొదలు పెట్టమంది.

ఆవిడ వెళ్ళిపోయింది కానీ ఎవరూ మందులూ తేలేదు, కట్టూ కట్టలేదు. గ్లూకోజ్ వెళుతున్నందువల్లా, ఒక ఇంజెక్షనూ, నెబ్యులైజేషన్ వల్ల తేరుకున్న ఆయన "ఇంక ఇంటికి వెళ్ళిపోదాం" అని గొడవ మొదలుపెట్టారు. "నాకేముంది? మాములు ఆయాసమే కదా "అంటూ..

మరో అరగంట సేపు వార్డంతా తిరిగాడు అప్పుడర్థం ఐంది అతనికి అక్కడ చాలినంత మంది సిబ్బంది లేరని, అందుకే ఉన్నవారికి విపరీతమైన పని ఒత్తిడి అని. చాలా కోపం వచ్చింది అతనికి. ప్రజల స్థాయిని కూడా గమనించకుండా వారి ముక్కు పిండి డబ్బులు వసూలు చేసే వీరు పేషెంట్ల సౌకర్యాల విషయంలో ఎందుకు ఇంత ఉదాశీనంగా వ్యవహరిస్తారు అని? కట్టిన డబ్బుకి తగిన సేవలని ఆశించడం నేరమా? అనుకున్నాడు.

అప్పుడు పడిందతని దృష్టి కంటికి కనిపించే ఎత్తులో ఉన్న స్టికర్ మీద. 'పేషెంట్ కేర్ ఆఫీసర్' "మీకేమైనా సమస్యలుంటే నన్ను సంప్రదించండి " అంటూ రాసి ఉన్న మొబైల్ నంబర్ చూసి వెంటనే ఫోన్ చేశాడు. "ఇప్పుడే వస్తాను " అంటూ ఆ అమ్మాయి తొందరగానే వచ్చింది. అప్పటివరకూ తను గమనించినవన్నీ చెప్పాడు.

అతని ఆవేశాన్ని, ఆందోళనని చూసి " సర్, ప్లీజ్ గివ్ మీ ఫైవ్ మినిట్స్ " అంటూ వెళ్ళింది ఆ అమ్మాయి. దాదాపు పది నిమిషాలకి ఒక నర్స్ వచ్చి మందులు ఇచ్చి, నెబ్యులైజేషన్ చేసింది. మరో అరగంటలో ఎక్స్ రే తీసి, కట్టు కట్టారు. ఈ లోపున ఆయా వచ్చి దుప్పట్లు మార్చింది. అసహనంతో నిట్టూర్చాడు.

తర్వాత అవసరమైనవీ, లేనివీ బోలెడన్ని టెస్ట్‌లు చేశారు. "ఇవి తెండి, అవి తెండి" అంటూ డజన్ల కొద్దీ చీటీలు చేతిలో పెట్టారు. పాతకాలపు మనిషైన ప్రమీలమ్మకి భర్తకి తొందరగా బాగవ్వాలన్న కోరిక ఎంత బలంగా ఉంటుందో, డబ్బు మంచినీళ్ళలా ఖర్చు అవుతుంటే బాధగా కూడా ఉంటుంది. అందులో అవసరమెంతో, అనవసరమెంతో తెలియకపోయినా కట్టక తప్పని పరిస్థితి.

పరీక్షల పేరిట తండ్రిని అస్తమానూ కదుపుతూ, కుదుపుతూ, సూదులూ అవి గుచ్చుతూ ఉంటే సారధికి చాలా బాధనిపించింది. తన ఇంట్లో ఆక్సిజన్ మిషన్‌తో సహా అన్నీ అమర్చాడు తండ్రికి. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇక్కడికి రానవసరం లేదు నిజానికి. ఈ ఒక్క ఐవీ ద్వారా గ్లూకోజ్ ఇవ్వడమనే ప్రక్రియ తప్ప ఇంత పెద్ద హాస్పటల్ లో ప్రత్యేకంగా జరుగుతున్నదేమీలేదు అనుకోకుండా ఉండలేకపోయాడు.

వస్తూనే ' గెట్ వెల్ సూన్ ' అని గులాబీ పూలూ, గ్రీటింగ్ కార్డ్‌లు ఇవ్వడం తప్ప మరే రకంగానూ పేషెంట్లకి విలువైనవీ, అత్యవసరమైనవీ అయిన సేవలందించలేని వీళ్ళు చేస్తున్నదేమిటి? ఈ హంగూ, ఆర్భాటమూ, పటాటోపమూ అవసరమా? వేలల్లో, కాదంటే లక్షల్లో డబ్బు వసూలు చేసే టప్పుడున్న ఉత్సాహం సేవలందించేటప్పుడు ఉండద్దూ? వాళ్ళకి ఇది మిగతావారిలాగే రోజూ చేసే ఉద్యోగమే కావచ్చు, కానీ ఇవన్నీ మానవతాకోణాన్ని మరిచిపోలేని ఉద్యోగాలు కదా, వీటిని కొంచం సున్నితంగా నిర్వహిస్తే బావుంటుంది కదా అని అతనికెన్నోసార్లు అనిపించింది.

ఈ ఏ.సీ లూ, రంగుల హంగులూ ఇవన్నీ ఎవరైనా అడిగారా? పైకి ఇంద్రభవనాలలాగానూ, అడుగుపెట్టిన తక్షణం మయసభలని తలపించే ఈ హాస్పటల్స్ ప్రజలని నిజంగానే భ్రాంతిలో ఉంచుతున్నాయా? ఈ మధ్యన హాస్పటల్స్ ని కూడా ఫైవ్‌స్టార్ హోటళ్ళలాగా జిమ్ములూ, స్పాలూ,మాత్రమే కాకుండా, మినీ షాపింగ్ మాల్సూ, రెస్టారెంటులూ, మల్టిప్‌లెక్స్ సినిమా హాళ్ళూ వగైరా హంగులతో తీర్చిదిద్దుతున్నారట. విదేశీయులూ, భారతదేశంలోని అత్యంత సంపన్నులూ వీరు ఎంచుకున్న క్లయింట్స్. ఈ వివరాలన్నీ పొందు పరుస్తూ ఈ మధ్యనే పేపర్ లో వచ్చిన వ్యాసాన్ని చదివాడు. ఇన్ని హంగులు

అవసరమా? అత్యంత అవసరమైన రోగ్యాన్ని అలక్ష్యం చేయకుండా సేవ అందిచడం అవసరమా? ఇలా రకరకాలైన - లోచనలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

అలా నాలుగు రోజులుంచుకుని ఓ ముహూర్తాన మళ్ళీ గులాబీ పువ్వులూ, గ్రీటింగ్ కార్డ్ ఇచ్చి పంపారు పింక్ గౌను వేసుకున్న చిన్న పిల్లని తీసుకొచ్చి మరీ. ఇది ఈ మధ్యనే కొత్తగా మొదలుపెట్టారుట, పెద్దవయసువారికి చిన్న పిల్లలని చూస్తే ఎంతో ముచ్చటగా ఉండి ఆనందంగానూ, ఆహ్లాదంగానూ ఉంటుందనిట.

ఆ నాలుగురోజులూ ప్రతీ చిన్న విషయానికీ ఎంతో ప్రయత్నం చేస్తే కానీ దొరకని ట్రీట్‌మెంట్, పని వత్తిడి అవుతేనేమీ, మరే కారణం వల్లనైతేనేమీ చిన్నగానో, ఒక్కోసారి గట్టిగానో చిరాకు పడే సిబ్బందీ, బల్లమీద డబ్బు పెట్టు, మందు పట్టు అన్నట్టుగా వ్యవహరించే వారి తీరులతో తీరని విసుగు వచ్చింది సారధికి, అతని వాళ్ళకీ. డిస్‌చార్జ్ చేసేటప్పుడు కూడా బట్టలు మార్పించడానికీ, తొందరగా వీల్ చెయిర్ తెప్పించడానికీ కూడా పెద్ద ప్రయత్నమే అయింది.

అక్కడకి ఎప్పుడు తండ్రిని తీసుకువచ్చినా తప్పక నయమవుతుందన్న అమ్మ సెంటిమెంటు తప్ప మరేమీ లేదు అక్కడ. ఆ అనుభవాలని గుర్తుచేసుకుంటే మరొకసారి అక్కడకి తీసుకుని వెళ్ళకపోవడమే మంచిది అనుకున్నాడు. కానీ క్రింద వాటాలో డాక్టర్ మామీ కూడా అక్కడకి తీసుకుని వెళితేనే మంచిది అనడంతో మరేమీ చెయ్యలేక యాంబులెన్స్‌కి కబురు పెట్టాడు. పని చేయకపోయినా, లోట్లు, లొసుగులూ ఉన్నా ప్రభుత్వాన్నీ, చట్టాన్నీ, వైద్యాన్నీ చేతిలోకి తీసుకోలేము కదా.

మరో దారి లేక యాంబులెన్స్ కోసం ఎదురు చూడసాగాడు.

●●●

Click here to share your comments on this story